కథ

# పథకం

- వలివేటి నాగచంద్రావతి

గొప్ప ఇరకాటంలో పడిపోయింది మాణిక్యాంబ. 'ఎగదీస్తే బ్రహ్మహత్యా దోషం, దిగదీస్తే గోహత్యా పాతకమనీ'- ఎవళ్ళని మెప్పించినా రెండోవాళ్ళతో నిష్ఠూరపడక తప్పని పరిస్థితి. ఎలా ఈ సమస్యకి పరిష్కారం..? మెదడుకి పదును పెట్టి మరీ ఆలోచిస్తోంది మాణిక్యాంబ. 'అదిగో, ఆ కౌలు రైతు అనువుగాని వేళలో వచ్చి నాకీ తలనొప్పి తెచ్చిపెట్టాడు' విసుక్కుంటోంది లోపల్లోపల.

నిజమే... తప్పంతా ఆ రైతు రాజన్నదే. లేకపోతే ఇంటిల్లిపాదీ చూస్తూండగా, ముఖ్యంగా ఇద్దరు కోడళ్ళూ అక్కడే ఉండగా- కౌలు డబ్బు తెచ్చి ఆవిడ చేతిలో పెట్టడమేమిటి- కాస్త కనుమరుగు ఉండవద్దా? ఇప్పుడు చూడు. కోడళ్ళిద్దరికీ 'అత్తగారు ఆ డబ్బుతో ఏం చేస్తుందా...' అన్న ఆరానే గదా.


నిజం చెప్పాలంటే ఆవిడకు తప్ప ఆ డబ్బు మీద ఎవరికీ అధికారం లేదు. మాణిక్యాంబకి పుట్టింటివాళ్ళు పసుపు, కుంకం కింద ఇచ్చిన అయిదెకరాల మామిడితోట మీది అయివేజు అది.

మొట్టమొదట్లో అయిదువేలో పదివేలో వచ్చేవి. రానురానూ రాబడి పెరిగింది. ఈసారి ఏకంగా లక్ష రూపాయలు వచ్చినయ్. భర్తకీ కొడుకులకీ తోటమీదొచ్చే దానిమీద చూపుపడదు. అది ఆవిడది. అంటే స్త్రీ ధనం. 'అది ఆశించటం తప్పు' అనే కాన్సెప్టుకి మైండ్ సెట్ అయిపోయింది వాళ్ళకి ఎప్పుడో.

అసలా డబ్బుతో అవసరం కూడా లేదు వాళ్ళకు. మాణిక్యాంబ భర్త పద్మనాభంగారిది మెడికల్ షాపు. మితిమీరిన రాబడి కాకపోయినా భార్య సొమ్ము వాడుకోవలసిన పరిస్థితి రాలేదెప్పుడూ. పెద్దకొడుకు వంశీకృష్ణ తండ్రి నడిచిన బాటలోనే డి.ఫార్మా చేసి తండ్రి షాపుకి లింకుగా ఇంకోచోట మరో బ్రాంచి తెరిచేశాడు. చిన్నకొడుకు రాధాకృష్ణ బ్యాంకు ఉద్యోగి. రెండేళ్ళు వేరే డిస్ట్రిక్టులో చేసి ఈమధ్యనే సొంతూరికి ట్రాన్స్‌ఫరయి వచ్చాడు. దానాదీనా వాళ్ళే చీర కొనుక్కోమనో, చేతిఖర్చుకి ఉంచుకోమనో తల్లిచేతికి డబ్బిస్తుంటారు. మరంచేత వాళ్ళతో ఆవిడ సొంత డబ్బుకే ప్రమాదం. లేదు.

ఇక ఆ రొఖ్ఖం ఏం చేసుకుంటుందీ అంటారా- ఉందిగా సీతామహాలక్ష్మి... ఆ పిల్లకి ఏ నగో నట్రో చేయించి పెడుతుంది. కోరిందల్లా కొని పెడుతుంది. ఇంతకీ సీతామహాలక్ష్మి అంటే ఎవరో అనుకునేరు- ఆవిడ చిట్టచివరి సంతానం. గారాబాల కూతురు. ప్రాణంలో ప్రాణం. తన సొంత ఆస్తికి వారసురాలు. కుదిరితే కూతురు అత్తవారింటికి వెళ్ళేలోగా ఏడువారాల నగలూ చేయించి ఉంచాలని మాణిక్యాంబ సంకల్పం. ఇప్పటివరకూ అలాగే కొద్దికొద్దిగా కూడుస్తూ వస్తోంది కూడా- ఒకళ్ళనడిగే పనిలేకుండా తన డబ్బుతోనే.

ఈ ఏడాది పరిస్థితి అదికాదు. ఈ ఏడే ఆరునెలలు అటూఇటుగా ఇద్దరు కొడుకుల పెళ్ళిళ్ళూ చేశారు. కోడళ్ళు ఇంటికి వచ్చారు. వాళ్ళకెదురుగా అత్త చేతికి అంత డబ్బొచ్చిపడితే వాళ్ళు చూస్తూండగా ఆ మొత్తమంతా తీసుకెళ్ళి కూతురికే కట్టబెట్టేస్తే ఏం బావుంటుంది... కోడళ్ళేమనుకుంటారు. కొడుకులకి కూడా తన చర్య బాధ కలిగించదా. అమ్మకి పలపక్షమనుకోరా. కొత్తగా వాళ్ళ మనసుల్ని కూడా చెడగొట్టినదవదా. ఇప్పటివరకూ అందరి మధ్యనా ఉన్న సద్భావం, సామరస్యం సన్నగిల్లిపోవా..!



అలా అని కూతురితో సమానంగా వాళ్ళకీ ఎలా పంచి ఇవ్వటం..? 'ఈ ఏడాది కాపు బాగుందమ్మా. మామూలుకంటే పదివేలు ఎక్కువే వస్తాయి' అని కాయ కోసేటప్పుడు తోటమాలి అంటే ఎంత సంతోష పడ్డదో మాణిక్యాంబ. కిందటేడాది సీత చెవులకి ఎర్రరాళ్ళు పొదిగిన బుట్ట లోలాకులు కొన్నది. ఈసారి ఇంకాస్త పెద్ద వస్తువే తీసుకోవచ్చును- అని. సీత ముందే చెప్పేసింది కూడా- 'ఈసారి తోట డబ్బుతో నాకు నెక్లెస్సో, గాజులో కొని పెట్టాలి సుమా' అని. ఇప్పుడు కోడళ్ళిద్దరికీ వాటా పెడితే సీతకేమి మిగులుతుంది - ముక్కుపుడక తప్ప...ప్చ్!

ఇన్నేళ్ళూ ఎదురుకాని ధర్మసంకటం. పాపం మాణిక్యాంబ... ఎంత మథనపడినా, ఎంతగా బుర్రకి పరీక్షపెట్టినా కోడళ్ళని ఏమార్చి సీతని సంతృప్తిపరిచే మార్గం దొరకందే..!

★ ★ ★

షాపుకి వెళ్ళేముందు జేబులోంచి తీసి పదివేల రూపాయలు భార్య చేతికిచ్చారు పద్మనాభంగారు. "శ్రావణమాసం కదా, వ్రతం రోజుకి మీ నలుగురూ బట్టలు తెచ్చుకోండి" అని. "కోడళ్ళకిది తొలి పూజ. కొంచెం మంచి చీరలు తీసుకో వాళ్ళకు" అన్నారు లోగొంతుతో.

ఆ అదను దొరకబుచ్చుకుంది మాణిక్యాంబ. "చీరలు కాదండీ, కొత్త కోడళ్ళకి పూజలో బంగారం పెడితే బాగుంటుంది. వాళ్ళ మెడలోకి ఏమన్నా నగ చేయించకూడదూ" అన్జెప్పి భర్త మొహంలోకి చూసింది. అప్పటికప్పుడు ఆవిడకు తట్టిన ఉపాయం ఏమిటంటే, భర్తచేత కోడళ్ళిద్దరికీ- చిన్నవో చితకవో ఆభరణాలు కొనిపించేసి, కంటికి నదరుగా పళ్ళెంలో పట్టుచీరల మీద వాటిని పెట్టించేసి, వాళ్ళతో ఆర్భాటంగా పూజ జరిపించేసి, ఆ చేత్తోనే తను కొనే వస్తువు ఏ ఆడంబరమూ లేకుండా మామూలుగా కూతురికిచ్చేసి, కంట్లో కనుమాయ చేసేయాలి... అదీ ప్లాను. అప్పుడయితే కోడళ్ళకంతగా తనమీద నిష్ఠూరం వేసే అవకాశం ఉండదని ఆవిడ ఆలోచన.

పద్మనాభంగారు ఆ ఆశని ఇట్టే నీరుగార్చేశారు. "అబ్బే, ఇప్పుడవేం లాభంలేదు. ఇన్‌కమ్‌టాక్సు గొడవల్లో ఉన్నాను. ఎక్కువ మొత్తం పెనాల్టీ కట్టాల్సొచ్చేలా ఉంది ఈ నెల. నా తలమీదికి నీ బిల్లు కూడా పెట్టకిప్పుడు" అన్నారు విసుగ్గా. అంతలోనే చల్లబడిపోయి "గ్రాము బంగారంలో వచ్చేలా - రూపు అనో ఏదో అంటావుగా - తేలికలో అవి తెచ్చేసి కార్యం జరిపించెయ్యి ఈసారికి" అనేశారు.

సమస్య భేతాళ శవంలా మళ్ళీ చెట్టెక్కి వెక్కిరించింది.

చివరిగా ఓ ప్రయత్నం... ఆ రాత్రి పద్మనాభంగారు బిల్లు పుస్తకాలు ముందేసుకుని పనిచేసుకుంటుంటే పక్కన కూర్చుని తన గోడు వెళ్ళబోసుకుంది మాణిక్యాంబ. దాచుకోకుండా మనసు విప్పింది. "ఏం చేయమంటారండీ" అనడిగింది చివరికి- ఆయన సలహా మీద నమ్మకం లేకపోయినా- మరోదారిలేక.

ఆయనో ధర్మరాజు. "తప్పు మణీ. నువ్వు చేయాలనుకునేది చాలా తప్పు. ఏ ఇంట్లోనో పుట్టి... ఎల్లకాలం మనతోపాటు ఉండిపోవా

6

లనొచ్చిన కోడళ్ళు మనకి సొంత పిల్లలతో సమానమే. నన్నడిగితే ఇంకా ఎక్కువే. నువ్వలా పక్షపాతబుద్ధితో ఆలోచించటం నాకేమీ బాగోలా. నువ్వే మళ్ళొకసారి నిదానంగా ఆలోచించు" అంటూ న్యాయశాస్త్రం విప్పారు.

'బుద్ధితక్కువై ఈయనన్నడిగాను' అనుకుంది మాణిక్యాంబ. 'ఈయనేదో తనకు వత్తాసుగా ఏదన్నా యుక్తిగా గట్టెక్కే విధానం చెబుతారనుకుంటే... హ్మ్... గత్యంతరమేముంది. ఇష్టమున్నా లేకపోయినా ఆయన చెప్పినట్టే చేయాలిక' ఓడిపోయినట్టు నీరసంగా నిట్టూర్చింది మాణిక్యాంబ.

★ ★ ★

కల్యాణ్ జ్యూయలరీ- శ్రావణలక్ష్మికి స్వర్ణంతో స్వాగతం చెప్పాలనుకునేవాళ్ళతో కిటకిటలాడుతోంది.

అంతమంది జనంలోంచీ విజయవంతంగా పని ముగించుకుని ఇద్దరు కోడళ్ళతో ఇవతలకు వచ్చింది మాణిక్యాంబ. కోడళ్ళు సంపూర్ణ, సంయుక్తల మొహాలు సంతోషంతో కళకళలాడుతున్నాయ్. అత్తగారు వాళ్ళకు ముత్యాల లాకెట్ ఉన్న హారాలు కొన్నది. అంతకుముందే చందనాలో వాళ్ళు కోరుకున్న రంగుల్లో డిజైనర్ చీరలు తీసుకుంది. ఆ చీరల మీదికి బ్లౌజులు కూడా. "చిన్న పిల్లలు మీరు. చక్కగా జాకెట్లు మోడల్‌గా కుట్టించుకోండి, బావుంటుంది" అన్జెప్పి పేరున్న టైలరింగు షాపు దగ్గరికి తీసుకువెళ్ళింది. ఓపిగ్గా వెతికివెతికి మ్యాచింగ్ గాజులూ, బిందీలూ కొన్నది. వచ్చేటప్పుడు ఐస్‌క్రీమ్ ఇప్పించింది.

అత్తగారి హృదయ వైశాల్యానికి ఉక్కిరిబిక్కిరి అయిపోయారు కోడళ్ళు. "ఎందుకిప్పుడు ఇంత ఖర్చు" అని వాళ్ళిద్దరూ వారించినా, మొహమాటపడినా కూడా ఆవిడ వినిపించుకోలేదు.

"మీరు మా ఇంట్లో కాలు మోపాక తోటమీద నాకొచ్చిన ఆదాయం ఇది. దీంతో మా ఇంటి మహాలక్ష్ములకి పర్సనల్‌గా ప్రజెంటేషన్ ఇస్తున్నాను. మీరు తృప్తిపడితే నాకెంతో సంతోషంగా ఉంటుంది. మాట్లాడకండి మరి" ఆధునిక అత్తగారిలా హుందాగా అంది మాణిక్యాంబ.

'ఎంత మంచిదో మా అత్తగారు. తనకని పైసా ఉంచుకోకుండా మాకోసం ఖర్చు పెట్టేసింది.' ఆ క్షణంలోనే అత్తగారికి 'ఫిదా' అయిపోయారు కోడళ్ళిద్దరూ.

కొద్దోగొప్పో ఉన్న కుటుంబం నుంచి వచ్చిన ఆడపిల్లలే వాళ్ళు కానీ, పుట్టింట్లో పొందిన వైభోగంకంటే అత్తింట్లో దొరికిన ఆదరణే కదా అమ్మాయికి గొప్ప పురస్కారం.

అత్తగారు పాత తరం గయ్యాళి, సూర్యకాంతంలా ఆరళ్ళు పెట్టే తరహా కాదని కాపురానికి వచ్చిన కొత్తల్లోనే అర్థమయిపోయింది వాళ్ళకు. తమతో సాయిలా, పాయిలాగా ఉంటుంది. పనిచెప్పినా పెత్తనం చెలాయిస్తున్నట్టుగా కాకుండా సాయపడమని అడుగుతున్నట్టుగా చెబుతుంది. అంచేత అత్తగారంటే ముందే ఓ మంచి అభిప్రాయం ఉంది వాళ్ళకి. ఈ రోజయితే ఆ సుహృద్భావం పరాకాష్ఠకు చేరిందనుకోవాల్సిందే.

అత్తగారి ఔదార్యం రవ్వంత శృతిమించిపోయిందనిపించిందెప్పుడంటే- ఇంటికి రాగానే సీతామహాలక్ష్మి ఎదురొచ్చి "ఏం తెచ్చారు, ఏం తెచ్చారు" అంటూ ఆరాటంగా బ్యాగులన్నీ వెతికేసి, "నాకేం తేలేదా?" అని బిక్కమొహం పెట్టిందే - అప్పుడనిపించింది.

తెల్లబోయారు వాళ్ళు. 'ఇదేమిటి, ముద్దుల ఆడబిడ్డనెలా మర్చిపోయాం. తాము సరే, అత్తగారో...'

మాణిక్యాంబ మాత్రం పట్టించుకున్నట్టే లేదు. "నీకెందుకే. మొన్నమొన్ననే కదా కాలేజీలో జాయినయ్యేటప్పుడు పది డ్రెస్సులదాకా కుట్టించాను. వాటిల్లో కొత్తవి ఒకటి రెండు



మిగిలే ఉన్నాయ్, అవేసుకుందువుగాని" అంది నిర్లక్ష్యంగా తేల్చేస్తూ.

"అదికాదు. నువ్వేమని మాటిచ్చావ్... తోట డబ్బు రాగానే చేతులకి... ..."

ఇంకా ఆ పిల్ల మాటలు పూర్తికాకుండానే- "సోర్యోయ్, ప్రతిదీ నువ్వనుకున్నట్టే జరగాలంటావ్. మరీ మంకుతనమెక్కువవుతోంది నీకు' అంటూ చెయ్యి పట్టుకుని బిరబిరా లాక్కెడుతున్నట్టే కూతుర్ని అక్కణ్ణుంచి తీసుకెళ్ళిపోయింది మాణిక్యాంబ.

ఎందుకోగానీ అపరాధం చేసిన ఫీలింగు. చేయని తప్పుకు చిన్నబోయి చూస్తూండిపోయారు సంపూర్ణ, సంయుక్తలు.

నాలుగు రోజుల్లో వరలక్ష్మీ వ్రతం. ఈ నాలుగురోజులూ కాలేజీ టైము మినహాయించి ఇంట్లో ఉన్నంతసేపూ మొహం ముడుచుకునే ఉంది సీత. మాణిక్యాంబ సముదాయిస్తూనే ఉంది. ఎవరూ వినకూడదన్నట్టుగా గుసగుసగా మందలిస్తూనే ఉంది. కానీ అదేం రాజభవనమా వినిపించకపోవటానికి.

వ్రతం రోజు- పూజ పూర్తయింది. "ఇక నైవేద్యాల పని మీదే" పూజ చేయించిన పురోహితులవారు దక్షిణ తాంబూలాదులు స్వీకరించి నిష్క్రమించారు.

చేసిన పిండి వంటలతోపాటు వెండి పళ్ళాలలో కోడళ్ళకు తెచ్చిన చీరలూ, హారాలున్న జ్యూయలరీ బాక్సులూ మనసులో రేగుతున్న తత్తరపాటు పైకగుపడనీకుండా పరమ శాంతంగా అమ్మవారి ముందర పెట్టింది మాణిక్యాంబ.

'మరి నీకూ, నాకో?' సీత మహా కోపంగా పైకెగరేసిన నొసలు వేసే ఆందోళనతో కూడిన ప్రశ్న.

భార్య వేసిన పథకమేమిటో తెలీక 'ఏం కథ?' అన్నట్టు పద్మనాభంగారు చిట్లించిన కళ్ళతో సందేహం నిండిన ప్రశ్న.

ప్రశాంతత నటిస్తోన్న మాణిక్యాంబ గుండె గుబగుబలాడిందో క్షణం. పల్చటి మబ్బుతెర వెనకాలున్నట్టున్న కూతురి మొహం ముల్లులా గుచ్చుతోంది ఆమె మనసులో. 'కొంపతీసి తన అతి తెలివి కొంప ముంచదు కదా'

"చూడు సీతా, నా బీరువా పక్క అలమరలో నీ కాటన్ డ్రెస్సూ నా కొత్త నేతచీరా ఉన్నాయ్... అవి తీసుకురా, పసుపు పెడతాను" బింకం చెడనీయకుండా సీతకి చెప్పింది మాణిక్యాంబ.

"ఒక్క నిమిషం ఆగు సీతా" ఎదురుగా కోడళ్ళు సంపూర్ణ, సంయుక్తలు. వాళ్ళ చేతుల్లో ప్యాకెట్లు.

సంపూర్ణ- సీత రెండు చేతులూ పట్టుకుని కుర్చీలో కూర్చోబెట్టింది. బొట్టుపెట్టి ప్యాకెట్ అందిస్తూ "మా ప్రకాష్ అన్నయ్య దుబాయ్ నుంచి పూజ కోసమని నాకీ డైమండ్ గాజుల జత పంపించాడు. ఎడంచేతికి వాచీ పెట్టుకుంటే కుడిచేతికి వేసుకునేది ఒకటే గాజు కదా. అందుకని మిగతా గాజు మా చిట్టి ఆడపడుచుకి" వెడల్పుగా ధగధగలాడుతోన్న గాజు సీత చేతికి తొడుగుతూ ఆప్యాయంగా నవ్వింది. "ఈ చీర కూడా వాడు పంపిందే అత్తయ్యా, వాడికి అస్సలు సెలెక్షన్ తెలీదు... చూడండి, పెద్దవాళ్ళు కట్టుకునేలాగా ఉంది. నాకు మీరు కొన్నదే బావుంది. ఇది మీరు కట్టుకోండి అత్తయ్యా. ఆ పెద్ద బోర్డరు మీకు చాలా బావుంటుంది" అంటూ ఇంకో ప్యాకెట్ మాణిక్యాంబకి అందించింది.

ఇప్పుడు సంయుక్త వంతు- "ఈ డ్రెస్సులు నాలుగూ కొత్తవి సీతా. అమ్మావాళ్ళిచ్చిన సారెలో ఈ నాలుగూ ఉన్నయ్. నేనెటూ డ్రెస్సులు వేసుకోవటం మానేశాను గదా... ఈ చుడీదార్లు నువ్వు వేసుకో. ఈ వాచీ కూడా నీకే... నచ్చిందా" అంది అభిమానం వెదజల్లుతూ.

మాణిక్యాంబ మొహంలో మెరుపు- విజయ దరహాసంతో. 'అమ్మయ్య. తన అంచనా తప్పవలేదు. తన వ్యూహం ఫలించింది.'

'హమ్మ మాణిక్యాంబా'- ముక్కున వేలేసుకుంది పీఠం మీదున్న అమ్మవారు. ★

తెచ్చే అమ్మాయితో తగాదా మొదలు- అలస్యమైందనో, లేకపోతే చీకట్నే వచ్చి నిద్ర పాడుచేసిందనో. కూరలమ్మి సరేసరి- రోజూ జగడమే. గమ్మత్తేమిటంటే కోప్పడ్డానికి ఆవిడకి మనుషులే అక్కర్లేదు - బాదం చెట్టు మీద గోలచేసే కాకులు, కిటికీ రెక్కల మీద వాలి కిచకిచమంటూ సందడి చేసే పిచ్చుకలు... దండెంమీద బట్టలు ఎగరగొట్టే హోరుగాలి... అన్నీ ఆవిడ ఆగ్రహానికి ఆజ్యం పోసేవే.

ఎందుకావిడకి లోకమంటే అంత కసి, ద్వేషం? ఈ సందేహానికి అనుకోకుండా సమాధానం దొరికింది.

ఆరోజు పొద్దున్నే నా గదికి వచ్చింది పాలమ్మాయి "ఎన్ని కేకలేసినా లెగట్లేదా అమ్మగారు, ఏమిటో కనుక్కోండి టీచరమ్మా" అని కంగారుగా అంటూ.

నేను వెళ్ళి తలుపుతట్టి చూశాను. ఊహూ. సుందరమ్మగారి పడగ్గదికీ నా గదికీ మధ్య నున్న తలుపు గడియ బలంగా లేకపోవటం మంచిదయింది. గట్టిగా తోస్తే విరిగిపడింది. లోపలికి వెళ్ళాం.

సుందరమ్మగారు పేలిపోయే జ్వరంతో ఒళ్ళు తెలీకుండా మూలుగుతోంది. పాపం, మొహం తుడిచి, కాఫీ తాగించాక కళ్ళు విప్పింది కాస్త.

ఆస్పత్రికి వెళదాం అంటే- తల అడ్డంగా ఊపింది. మరేం చేయను? నా దగ్గరున్న ట్యాబ్‌లెట్ ఏదోవేసి జావ కాచి పట్టించాను. ఆరోజు స్కూలుకి సెలవుపెట్టి ఆవిడ దగ్గరే ఉండిపోయాను. మూసిన కన్ను తెరవట్లేదావిడ. పగలు గడిచింది. సుందరమ్మగారికలాగే ఉంది. పాలమ్మాయిని సాయం ఉండమంటే "వంటిమీద్ద ఉన్నదమ్మా, మా ఆయన ఊరుకోడు" అంది.

నాకా రాత్రి ఎంత భయంకరంగా గడిచిందో చెప్పలేను. సుందరమ్మగారు జ్వర తీవ్రతలో ఒకటే కలవరింతలు. 'జ్యోతీ, నన్ను వదిలి వెళ్ళకమ్మా' అని ఏడుస్తుందోసారి. 'నన్ను ముట్టుకోకండి' అరుస్తుందోసారి. గుండెలు కరిగేలా కుములుతుందింకోసారి.

పండుటాకులా పడున్న ఆమెపట్ల జాలితో సానుభూతితో మనసు కరిగిపోయింది నాకు. 'పాపం, పైకి పెద్దపులిలా గర్జిస్తుంది కానీ గతంలో ఎన్ని కష్టాలనుభవించిందో!'

ఎలాగో తెల్లవారింది. నేను నా గదికొచ్చి కాఫీ పెడుతున్నాను. సుందరమ్మగారి గది లోంచి ఎవరిదో కొత్త గొంతు. ఎవరు చెప్మా, బంధువులా స్నేహితులా? ఎవరైతేనేమి ఇంకొకరున్నారంటేనే తేలిగ్గా అనిపించింది నాకు. బరువు దించుకుందామని కాదు, పంచుకుందామని.

ఇంకో కప్పు కాఫీ కలిపి తీసుకువెళ్ళాను. సుందరమ్మగారి మంచానికి కాస్త దగ్గరగా నిలబడి ఉన్నారాయన. మా తాతగారి వయసుంటుంది. చూడంగానే గౌరవం కలిగేలా ఉన్నారు.

నేనిచ్చిన కాఫీ కప్పందుకుంటూ "నా పేరు నందగోపాలమ్మా. ఆయుర్వేద వైద్యుణ్ణి. సుందరి శరీరతత్వం నాకు తెలుసు. మందిచ్చిపోదామని వచ్చాను" అన్నారాయన సాదాగా.

'సుందరి!' నా లోలోపల ఎంత ఆశ్చర్యమో!

"నీకు పేపరు వేసే కుర్రాడు చెప్పాట్ట- నాకు బాగాలేదని" నీరసంగా అంటోంది సుందరమ్మగారు- నాక్కలగబోయే సందేహానికి సమాధానంగా.

ఆయన నా చేతికి కొన్ని కాయితం పొట్లాలిచ్చారు. ఎలా వాడాలో చెప్పారు. నా దగ్గర సెల్ ఉందేమో కనుక్కున్నారు. తన నంబరు రాసిచ్చారు "సాయంత్రానికల్లా తగ్గిపోతుంది. తగ్గకపోతే నాకు ఫోను చేయి" అని చెప్పి వెళ్ళిపోయారాయన.

రాకతో కబురందగానే రెక్కలు కట్టుకు వాలే అనుబంధం. శరీరతత్వం తెలిసినంత



దగ్గరితనం అయినా, అంత ఉదాసీనం... ఎవరాయన, ఏమవుతారు? - ఎన్ని ప్రశ్నలో. కానీ, సుందరమ్మగారిని అడిగే తాహతా నాకు?

★ ★ ★

ఆరోజు సోమవారం. సుందరమ్మగారు యథాస్థితికి వచ్చేశారు. ఆవిడ సంగతేమోగానీ ఇరవైనాలుగ్గంటలూ నేనుపడ్డ టెన్షన్ నుంచి రిలీఫ్ చేసి సుఖాంతంగా ముగించినందుకు ఆ భగవంతుడికి కృతజ్ఞతలు తెలుపుకోవాలని పించింది.

ఆ సాయంత్రం శివాలయానికి వెళ్ళి దేవుడి దర్శనం చేసుకు వస్తూండగా మండపం మెట్లమీద కూర్చుని కనిపించారు నందగోపాలుగారు.

దగ్గరగా వెళ్ళి నమస్కరించాను. "సుందరమ్మగారి జ్వరం తగ్గిపోయిందండీ" అన్నాను నేను కూర్చుంటూ.

"నీ దగ్గర్నుంచి ఫోన్ రాకపోతే అదే అనుకున్నాను" అన్నారాయన చిరునవ్వుతో.

"మొన్నరాత్రి ఆవిడ పరిస్థితికి చాలా గాభరాపడ్డాను. ఈ సంగతి చుట్టుపక్కల వాళ్ళకి చెప్పినా ఒక్కరూ తొంగిచూడలేదు."

"ఊ"

నేను సంభాషణ తెంపలేదు, పొడిగించాను. "సుందరిగారి గురించి శ్రద్ధ తీసుకున్నది మీరొక్కరే డాక్టరుగారూ. మీకామె చాలా కాలంగా తెలుసుననుకుంటాను. అన్యథా భావించనంటే ఒక్క మాట అడుగుతాను. ఎందుకావిడ ప్రతివాళ్ళూ తన ప్రత్యర్థులే నన్నట్టు పోరాటానికి సిద్ధమవుతుంది? ఎందుకంత అశాంతిగా అసహనంగా కనిపిస్తుంది?" అని.

నాకేసి దీర్ఘంగా చూశారాయన. "ప్రతి కన్నీటిచుక్క వెనకా భరించలేని బాధా, విపరీతమైన మానసిక క్షోభా ఉంటాయ్. చేతకానితనంతో వచ్చే ఆగ్రహం వెనుక కర్కశమైన అణచివేత, తీవ్ర ఆశాభంగం ఉంటాయ్- ఇది నా ఉద్దేశ్యం. వీటన్నిటికీ గురి అయిన నిర్భాగ్యురాలు సుందరి.

పొద్దు వాటారుతూ చీకట్లు మిగిలిస్తున్న సంధ్యాసమయం. గుడి అంతటా నూనె దీపాల వెలుగులు. ఆధ్యాత్మికతతో కూడిన వైరాగ్యాన్ని తలపిస్తూ సన్నగా వినవస్తున్న మంత్రోచ్చాటన. వీటిమధ్య వినిపించారాయన జీవితం వంచించిన ఓ అబల కథ...

ఇప్పటి సుందరమ్మ ఒకనాటి సుందరి. సువర్ణసుందరి. నిజంగానే బంగారుబొమ్మ. 'శాపవశాత్తూ నా కడుపున పుట్టిందీ దేవకన్య'- అని మురిసిపోయేది తల్లి. 'పోటీలకు వెళ్ళని ప్రపంచ సుందరివి నువ్వు'- అని పొగిడేవాళ్ళు స్నేహితురాళ్ళు.

అంతటి అందాలభరిణకి ఆయుర్వేదం నేర్చుకున్న ఏ పక్కింటి సామాన్యమైన కుర్రాడో- 'ప్రేమిస్తున్నాను. గుండెల్లో పెట్టుకుంటాను' అంటే మాత్రం, 'సరే'ననే ఖర్మేమిటి? ఏ ఆధునిక రాకుమారుడో, పంచకల్యాణి లాంటి అందమైన కారెక్కి వచ్చి తనని చేపడతాడని కలలు కనటంలో తప్పేమిటి?

ఆ అద్భుతమైన అవకాశం ఓరోజు రానే వచ్చింది. ఆ ప్రాంతంలో ఇండస్ట్రీ స్థాపించిన ఓ పారిశ్రామికవేత్త నుంచి ఓ ఆఫరు - 'మా కుమారుడికి మీ కుమార్తెనివ్వటం మీకంగీకారమైతే ఫలాన రోజున నిశ్చితార్థానికి తరలి రాగలమని.'

వారి దగ్గరే పనిచేస్తున్న ఓ గుమాస్తా సుందరి తండ్రి. ఉబ్బితబ్బిబ్బయ్యాడు. అదృష్టం గుమ్మం దగ్గరకొస్తే రాదనటమా... ఎంత మాట. సుందరి నాసలు పైకెగిరేయి 'ఇదీ, నా విలువ' అన్నట్టు.

నిశ్చితార్థం వేళదాకా ఆ గర్వమలాగే నిలిచిపోయింది కూడా. ఉంగరం తొడగబోయే ముందు చూసింది పెళ్ళికొడుకుని- 'ఇతనా,

తనక్కాబోయే వరుడు? నల్లగా, లావుగా మూడొంతులు వెనక్కిపోయిన జుట్టుతో, ముందుకొస్తున్న బొజ్జతో... తల్లీ తండ్రీ పెళ్ళి చూపుల మాట ఎత్తనీయకుండా దాటవేసింది ఇందుకా - ?' మూర్ఛపోయింది సుందరి.

ఏం లాభం, సమయం మించిపోయింది. ఎవరూ ఆ అమ్మాయి గోడు వినిపించుకో లేదు. కాదంటే నూతిలో దూకుతానన్నది తల్లి. విషం తాగుతానన్నాడు తండ్రి. సగటు ఆడపిల్ల సుందరి. పెళ్ళయిపోయింది.

నరకం మొదలైంది. వికారంగా ఉన్నా అహంకారానికి తక్కువలేదు భర్తకి. తిరస్కారంగా జవాబిచ్చేది సుందరి. కాడిస్తయ్యేవాడు భర్త. ఆ పామూ ముంగిసల కాపురం కూడా ఎన్నాళ్ళో సాగలేదు. జ్యోతి పుట్టిన మూణ్నెల్లకే కారు యాక్సిడెంటులో పోయాడతను. సామరస్యంగా మెలగని సుందరికి స్వల్పంగా భరణం ఇచ్చి ఇంట్లోంచి పంపేశారు భర్త తరఫువారు.

తేలిగ్గా గాలి పీల్చుకుంది సుందరి. భర్త లేకపోవటం విషాదమనిపించలేదు. పుట్టింటి వాళ్ళని కూడా దగ్గరికి రానివ్వలేదు. 'నా కూతురు చాలు నాకు, మరెవరూ అక్కర్లేదు' అనేది మొండిగా.

తన చిన్ననాటి చిత్తరువులా ఉన్న కూతురంటే ప్రాణం సుందరికి. ఆ బిడ్డని చూసుకుంటూ గడిచిన కాలంలోని చేదుని మరిచిపోయి బతుకుమీద మళ్ళీ ఆశలు పెంచుకుంది. కూతురే లోకంగా బతకటం మొదలుపెట్టింది.

ఒక్కోసారి మితిమీరిన తీపి వెగటవుతుంది. తల్లి కురిపించే ప్రేమని అడ్వాంటేజ్‌గా తీసుకుని అతిగా స్వేచ్ఛకి అలవాటుపడిపోయిన జ్యోతి ఒకరోజున ఇంటినుంచి బయటకు వెళ్ళి మరి తిరిగిరాలేదు. ఏమయిందో తెలీదు.

పిచ్చిదయిపోయింది సుందరి. ఏడ్చే ఆమె వెనుక లోకుల హేళనలు. ఉన్న ఊరు వదిలిపెట్టేసింది. ఇక్కడకు వచ్చేసింది. అత్తవారు భరణంలో భాగంగా ఇచ్చిన ఇల్లది. తను పుట్టిన ఊరు కూడా ఇదే.


జ్యోతి ఆమె ఆశల మీద కొట్టిన దెబ్బ ప్రభావం ఆమె మానసికస్థితిని పూర్తిగా మార్చేసింది. సౌమ్యత పోయింది. అందరికీ కంటగింపయింది.

ఆనాటి అందాలరాశి... ఈనాటి ముళ్ళపొద సుందరమ్మ" ముగించి నిట్టూర్చాడు డాక్టరుగారు.

"ఆ అమ్మాయి పేరు ఏమిటన్నారూ- జ్యోతా?" హఠాత్తుగా అడిగాను లేస్తూ.

"అవును" అంటూ ఆశ్చర్యంగా చూశారాయన.

భారమైన మనసుతో ఇంటికి తిరిగివచ్చాను. గుమ్మంలోనే ఉంది సుందరమ్మగారు. "ఆడపిల్లవి ఇంత చీకటిపడేదాకా షికార్లు చేసొస్తావా? ఇలాంటివి నా ఇంట్లో కుదరవమ్మాయ్" చిటపటలాడ్తూ స్వాగ



తిస్తున్న ఆమెను అభిమానంగా చూశాను.

★ ★ ★

"జ్యోతి నాకు తెలుసు."

పైకి తోడుతున్న నూతిలో చేదని తుళ్ళిపడి వదిలేసింది సుందరమ్మగారు. మొహంలో విపరీతమైన ఆందోళన. క్షణాల్లో నుదుటిమీద చెమట బిందువులు చేరటం చూశాన్నేను.

"జ్యోతెవరు? ఎవరో నాకు తెలీదు" గబగబా ఇంట్లోకి వెళ్ళిపోయిందావిడ. గమ్మునయిపోయాను. నేను స్కూలుకు వెళ్ళేదాకా నా గది ముందర చాలాసార్లు తచ్చాడటం గమనించాన్నేను. ఆ సాయంత్రం స్కూలు నుంచి వచ్చి నూతి దగ్గర కాళ్ళు కడుక్కుంటూంటే ఏదో పని ఉన్నట్లొచ్చి "జ్యోతెవరు?" అంది యథాలాపంగా అడిగినట్లు.

"మా ఇంటి దగ్గర పిల్లలకి ట్యూషన్లు చెబుతూండేది." నాకు తెలుసు- పొద్దుట్నుంచీ ఆ మాట నన్నడగాలని ఎంత ఆత్రపడుతున్నదో.

"ఇప్పుడు?"

"చచ్చిపోయింది. కాన్పులో సుస్తీ చేసి" సన్నగా వణికింది నా కంఠం.

శరవేగంగా లోపలికి వెళ్ళి తలుపు వేసుకుంది సుందరమ్మగారు- మాటా మంతీ లేకుండా.

దీపాలుపెట్టే వేళ తులసికోట దగ్గర దీపం వెలిగిస్తుంటే చూశాను- మంకెన పువ్వుల్లా ఎర్రగా తడిగా ఉన్నాయ్ ఆవిడ కళ్ళు.

★ ★ ★

"లీవు వేకెన్సీలో వచ్చానిక్కడికి. అది పూర్తయింది. రెండు రోజుల్లో వెళ్ళిపోతున్నానిక్కణ్ణుంచి. సామానూ అదీ ఎక్కువుంటుందని అన్నయ్య వచ్చాడు నాకు సాయంగా."

వెంట కావేరి కూడా ఉంది. పదేళ్ళుంటాయ్ దానికి. వందనంగా ఉంటుంది. చెప్పిన పనులు చక్కగా చేస్తుంది. అది మా అంట్లగిన్నెలు తోమి, బోర్లిస్తుంటే సుందరమ్మగారు పరీక్షగా చూస్తున్నారు. చెప్పాను- "జ్యోతి కూతురు. తల్లి చచ్చిపోయాక మా పనిమనిషి పెంచింది దీన్ని. ఆ పనీ ఈ పనీ చేసిపెడుతూ మా ఇంట్లోనే ఉంటోంది" అని.

తనక్కాదన్నట్లు తల తిప్పుకున్నదావిడ.

వెళ్ళే సమయం దగ్గరపడింది. సుందరమ్మగారు బయటకు మొహం చూపించట్లేదు. నేనే వెళ్ళాను- సెలవు తీసుకుందామని.

గోడకానుకుని ఎటో చూస్తూ కూర్చున్నదావిడ. ముఖంలో ఎంతో ఘర్షణపడిన ఛాయలు.

"వెళ్ళొస్తానాంటీ"

హఠాత్తుగా లేచి నా చేతులందుకుంది సుందరమ్మగారు. "కావేరిని నా దగ్గర ఉండనీ టీచర్."

కావేరి చేతిని ఆవిడ చేతికందించి తృప్తిగా బయలుదేరాను నేను.

స్టేషన్లో మా కోసమే ఎదురుచూస్తున్నారు నందగోపాల్‌గారు. ఆయన కళ్ళల్లో నామీద అభిమానంతోపాటు సన్నని అనుమానరేఖ.

ఏమీ మాట్లాడకుండానే క్షణాలు గడిచాయి. గంట కొట్టారు. రైలు దూరంగా కనిపిస్తోంది.

"కావేరి ఎవరు, నిజం చెప్పండి టీచర్" అడిగారాయన.

"మీకెందుకా అనుమానం. తను జ్యోతి కూతురే" అన్నాను.

చాలా రిలీఫ్ కనిపించిందాయన మొహంలో. నా తలపై చేయుంచారు ఆప్యాయంగా.

బండి ఆగింది. ఎక్కి కూర్చున్నాం. రెక్క వాలింది. రైలు కదిలింది.

దూరమవుతున్న డాక్టరుగారిని చూస్తూ అనుకున్నాను- 'క్షమించండి డాక్టరుగారూ, కావేరి- జ్యోతి కూతురు కాకపోవచ్చును. కానీ, జ్యోతిలా వంచించబడి ప్రాణాలు పోగొట్టుకున్న ఓ నిర్భాగ్యురాలి బిడ్డే తను. అన్నతదోషం నాకంటితే అంటనీగాక. నా అన్న మమకారం కోసం ఆక్రోశిస్తున్న ఓ గుండెకు ఊరటా, ఓ అనాథకు ఆసరా కలిగించాను. ఆ తృప్తి చాలు నాకు. ఇది మీక్కూడా తెలీటం నాకిష్టం లేదు. సారీ డాక్టర్." ★

## కలం కదిలించండి

సృజనాత్మకత కలిగిన రచయితలకూ రచయిత్రులకూ ఇదే ఆహ్వానం. మానవ జీవితంలోని విభిన్న పార్శ్వాలను స్పృశిస్తూ మధురమైన అనుభూతులను పాఠకులకు పంచే కథలకు 'ఈనాడు' స్వాగతం పలుకుతోంది. భావం ఏదైనా... కథనంలో వైవిధ్యం, పాఠకులను ఏకబిగిన చదివించగలిగే బిగువూ ఉండాలి. ఆశావహ దృక్పథంతో సాగే కథలకు ప్రాధాన్యం. కథ సాధారణ చేతి రాతలో ఏడు అరఠావులకు మించకూడదు.

కథలు పంపాల్సిన చిరునామా

**ఆదివారం అనుబంధం**
రామోజీ ఫిలింసిటీ, హయత్‌నగర్ (మం),
రంగారెడ్డి జిల్లా, తెలంగాణ-501 512.